నువ్వు చేసిన మంచి పని
మనుషులు గుర్తించక పోవచ్చు,
కాని దైవం మాత్రం అంతా
గమనిస్తూనే ఉంటుంది.
మంచికి మంచి, చెడుకు చెడు
అనుభవించడానికి సిద్ధంగా
ఉండాల్సిందే..!

netisudiksha.online


# నేటి సుదీక్ష

సమాజానికి సరైన దృక్పథం

SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
వెలువడుతున్న నేటి సుదీక్ష
దినపత్రికలో,బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా
పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ
స్థాయిల్లో ఉత్సహవంతులైన
యువతి,యువకులు కావలెను, కొత్త వారికి
మరియు అనుభవం ఉన్నవారికి
అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333



హనుమకొండ సంపుటి 01 సంచిక 73 బుధవారం ,ఆగస్టు 05, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170


సెప్టెంబర్ 1 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు

## టీ-ఫైబర్ ఇంటర్నెట్:



**హైదరాబాద్:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ కా ర్యాలయాలకు సెప్టెంబర్ 1 నుంచి టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించా లని అధికారులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. రాష్ట్ర సచివా లయంలో టీ-ఫైబర్ సేవల విస్తరణపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా నిర్ణీత గడువులోగా రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1 తర్వాత ఏ ప్రభుత్వ శాఖ కూడా ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగిస్తూ బిల్లులు చెల్లించవద్దని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు ఏకీకృత డిజిటల్ నెట్‌వర్క్ ఏర్పాటు లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విభాగాలు వినియోగిస్తున్న టీ-స్వాన్ (౧-వాఔాూచీ) నెట్‌వర్క్‌ను వచ్చే నెల రోజుల్లో పూర్తిగా టీ-ఫైబర్‌కు బదిలీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీకి అత్యాధునిక టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ కనెక్టివిటీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.

ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు రేవంత్ రెడ్డి

# విదేశీ పర్యటనలు


- రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు విదేశీ పర్యటనలకు వెళ్లనున్న సీఎం
- మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్లనున్న ముఖ్యమంత్రి



రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణ సంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది.రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లనున్నారు. రేపు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు.ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు : తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అం తర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొ ందించడం, క్రీడారంగాన్ని మరింత బలో పేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపట్టను న్నారు. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు విదేశీ పర్యటన చేయను న్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు, అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది.ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం : ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు.

పేదరికం లేని సమాజం

## చూడాలనేది నా కల



**అమరావతి, ఆగస్టు 4:** రాష్ట్ర సమగ్ర సమాచారం ప్రజలకు తెలపడం ముఖ్యమని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం చంద్రబాబు 2024 నాటి పరిస్థితులు, తాజా పరిస్థితులపై వాస్తవాలు ప్రజల ముందు పెట్టారు.రెండు రాష్ట్రాలు అభివృద్ధి చేశా: ప్రజలకు ఆర్థిక పరిస్థితిపై సమగ్ర సమాచారం చెబుతున్నట్లు సీఎం వివరించారు. ఇదొక చారిత్రక అంశమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం బాగా పని చేస్తుందనేందుకు భోగాపురం విమానాశ్ర యం ప్రారంభోత్సవం నిదర్శనమన్నారు. ప్రభుత్వం పనిచేస్తే ప్రజలు ఎలా స్పందిస్తారో అన్నదానికి భోగాపురం ఉదాహరణ అని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తు అనుసంధానానికి అంతర్జాతీయ గేట్‌వేగా తయారు చేశామన్నారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లో తెలుగు జాతి కోసం అభివృద్ధి చేశామని, రెండు రాష్ట్రాలు కూడా తానే అభివృద్ధి చేసినట్లు సీఎం పేర్కొన్నారు. 'సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుంది. మార్పు తేవాలనే పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం.

కాంగ్రెస్ అబద్ధాలకు 'కాళేశ్వరం'

## నీళ్లే సమాధానం





**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాలకు క్షేత్రస్థాయిలోని నీళ్లే సరైన సమాధానం చెబుతున్నాయని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి. రామారావు (కేటీఆర్) పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరొకసారి చాటిచెబుతోందని ఆయన సోమవారం సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ 'ఢ' (ట్విట్టర్) వేదికగా వ్యాఖ్యానించారు."రెండు లక్షల ఎకరాలకు భరోసా!"కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా శ్రీరాంసాగర్ () వరద కాలువను 'రివర్స్ పంపింగ్' పద్ధతిలో పునరుజ్జీవింపజేస్తున్న దృశ్యాలను కేటీఆర్ పంచుకున్నారు. వరద కాలువ పరిధిలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్‌హౌస్‌ల నుండి నీటిని నిరంతరాయంగా ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు. ఈ ఎత్తిపోతల ద్వారా సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతోందని, ఇది తెలంగాణ రైతన్నల పంటలకు కొండంత భరోసానిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు."రైతులకు నిజా నిజాలు తెలుసు' 'కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని అబద్ధాలు, దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కేటీఆర్ అన్నారు. పచ్చని తమ పొలాల్లో నేరుగా ప్రవహిస్తున్న కాళేశ్వరం జలాలను కళ్లారా చూస్తున్న తెలంగాణ రైతాంగానికి ఏది నిజమో, ఏది అబద్ధమో స్పష్టంగా తెలుసని ఆయన స్పష్టం చేశారు.

## డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలకు సన్నాహాలు

- సీఎంఆర్‌పై మంత్రి ఉత్తమ్ ఫోకస్



**హైదరాబాద్, ఆగస్టు 4:** తెలంగాణలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవస్థపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత, సాంకేతిక సంస్కరణలపై చర్చించారు. గత 10-12 ఏళ్లుగా సీఎంఆర్‌లో జరిగిన వ్యవహారాలపై లోతుగా పరిశీలన చేపట్టారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బకాయిల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. ఇప్పటివరకు నిర్వహించిన విజిలెన్స్ దాడులు, నమోదైన కేసులు, వాటి దర్యాప్తు పురోగతిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. జిల్లాల వారీగా రైస్ మిల్లర్ల పనితీరు, సీఎంఆర్ బకాయిల పరిస్థితి, డిఫాల్ట్‌ల వివరాలపై అధికారులు నివేదికలు సమర్పించారు. ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కొత్త వ్యూహాలను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ విభాగాల ఉన్నతాధికారులకు సమావేశానికి హాజరుకావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ నిధుల రక్షణే ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

మెటాపై కేసు నమోదు చేసిన ఆ డీసీపీని..

## రేవంత్‌రెడ్డి బదిలీ చేశారు

**హైదరాబాద్, ఆగస్టు 4 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యా నించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. (మంగళవారం) కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాం గం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించా రని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు.గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా.



నీట్ ప్రవేశాలకు

## సర్వం సిద్ధం


- 13 నుంచి రాష్ట్ర స్థాయి సీట్లకు ?

**కౌన్సిలింగ్ ప్రక్రియ**

**న్యూ ఢిల్లీ :** వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యా లయం కీలక అప్‌డేట్ ఇచ్చింది. నీట్ ప్రవే శాల కౌన్సెలింగ్‌కు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వర్సిటీ వైస్-ఛాన్స లర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రకటించారు. సాంకే తిక కారణాల వల్ల ఆలిండియా కోటా కౌన్సె లింగ్ ఒకరోజు ఆలస్యంగా ప్రారంభం కాను ందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బ ందులు కలగకుండా కట్టుదిట్ట మైన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించా రు.ఆలిండి యా కోటా సీట్ల భర్తీకి సంబంధిం చిన కౌన్సెలింగ్ ఇవాల్టి నుంచే ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, కొన్ని సాంకేతిక కారణాల రీత్యా అది సాధ్యపడలేదు. దీంతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడించారు. ఇక రాష్ట్ర కోటా సీట్లకు సంబ ంధించిన కౌన్సెలింగ్‌ను ఈ నెల 13వ తేదీ ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు.

నటి త్రిషపై వివాదాస్పద వ్యాఖ్యలు

## మద్రాస్ హైకోర్టు బెయిల్ మంజూరు



**మద్రాస్ :** సినీ నటి త్రిషపై అసభ్య వ్యాఖ్యల కేసులో తమిళ నాడు ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిం ది. పిటిషనర్‌ను రిమాండ్‌కు తరలించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని అడ్వకేట్ జనరల్ విజయ నారాయన్ పేర్కొనడంతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ తర్వాత స్టేషన్ బెయిల్‌పై ఉదయనిధిని విడిచిపెడతామని కోర్టుకు తెలిపారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న కోర్టు పోలీసుల విచారణకు సహకరించాలన్న షరతుతో ఉదయనిధికి బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందు తంజావూరు పోలీసు లు ఉదయనిధిని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. ఈ క్రమంలో డీఎంకే కార్యకర్తలు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పలువురు డీఎంకే కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను తమిళనాడు ప్రతిపక్షనేత ఉదయనిధి స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. కావాలనే తనపై తప్పుడు ప్రచారాన్ని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. తాను అనని మాటలను అన్నట్లు చూపించడానికి 'కట్, కాపీ, పేస్ట్' ఎడిటింగ్ పద్ధతులను ఉపయోగించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని వ్యాఖ్యానించారు. ఇటువంటి బెదిరింపులకు తాను భయపడనని, ఈ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. అలాగే, తన అరెస్టుపై పోలీసుల చర్యను ఒక "కామెడీ"గా అభివర్ణించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న అనంతరం ఉదయనిధి మీడియాతో మాట్లాడారు.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం, ఆగస్టు 05, 2026



# తెలంగాణ వ్యాప్తంగా మేఘావృతమైన ఆకాశం - హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన



**హైదరాబాద్ :** నైరుతి రుతుపవనాలు కదులికలు చురుగ్గా ఉన్నాయి. వీటి ప్రభావంతో హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అంతేకాకుండా ఎల్లో అలర్ట్? కూడా జారీ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని, అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో సోమవారం ఉత్తర తెలంగాణతో పాటు హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. కామారెడ్డిలో అత్యధికంగా 18.2 సెంటీ మీటర్లు, వికారాబాద్, సంగారెడ్డి వంటి జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు ప్రకటించారు. హైదరాబాద్‌లో సోమవారం సాయంత్రం తేలికపాటిగా మొదలైన వర్షం రాత్రికి ఉద్ధృతంగా మారింది. గంటల తరబడి కురిసిన వానతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. రహదారులపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైడ్రా, మున్సిపల్ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో పంపింగ్ మోటార్లతో నీటిని తొలగించే పనులు కొనసాగించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీ నగర్, మలక్‌పేట్, చంపాపేట్, చాదర్‌ఘాట్, అసెంబ్లీ, లక్డీ కా పూల్, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బాచుపల్లి, నిజాంపేట్, కుత్బుల్లాపూర్‌లో కురిసిన వర్షానికి నీరు రోడ్లపైకి చేరడంతో జనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారు. ఈ వర్షంతో నగర జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు వాతావరణ శాఖ మరో 24 గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్‌తో పాటు మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. నగరంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీళ్లు చేరాయి. ఉదయం ప్రజ జీవనానికి ఏ విధంగా ఇబ్బంది ఉండకూడదని హైడ్రా అర్ధరాత్రి 12 గంటల సమయంలోనూ సేవలందించింది. నగరవ్యాప్తంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో హైడ్రా ఐ=ఖీ, వీ=ు బృందాలు సేవలు అందించాయి. రహదారుల్లో నిలిచిన వరద నీటిని సాఫీగా డ్రైనేజీల్లోకి పంపేసింది. వర్షం ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని.., క్షేత్ర స్థాయిలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి హైడ్రా అధికారుల సూచనలు చేస్తూ సిబ్బందితో పని చేయించారు. అవసరమైన చోట వెనువెంటనే సహాయక చర్యలతో పరిస్థితులు చేయిదాటిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ నాశనం చేస్తున్నారు



**న్యూఢిల్లీ:** ఇంజనీరింగ్ విద్యార్థులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య పట్ల చిత్తశుద్ధి లేని వ్యక్తి విద్యాశాఖ మంత్రిగా ఉండటం సరైనది కాదని అరవింద్ అన్నారు. విద్యాశాఖ బాధ్యతలను మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తే బాగుంటుందని సూచించా రు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ సవాల్ విసిరారు. ఎవరి సహకారం లేకుండా రేవంత్ రెడ్డి నామినేషన్ పత్రాలు నింపగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేవని అరవింద్ ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో బ్లాక్ బోర్డులు, చాక్ పీసులు, విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేని పరిస్థితి ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా సీఎం ఒక్క ప్రభుత్వ పాఠశాలను అయినా సందర్శించారా అని ప్రశ్నించారు. ఉన్న పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కొత్త పాఠశాలల నిర్మాణం పేరుతో ప్రభుత్వం కమిషన్ల కోసం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంపై పెట్టాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరప్రతాలు ఆవిష్కరణ



**దమ్మపేట, ఆగస్టు 04 :** ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి మాట్లాడుతూ ప్రతి గూడెంలో ఆదివాసి జెండా ఎగురవేయాలన్నారు. జాతి ఐక్యతను చాటాలని, తమ జాతి హక్కులను, చట్టాలను రక్షించడానికి బలమైన ఉద్యమం నిర్మించే దిశగా యువత అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున ప్రతి ఒక్క ఆదివాసి జిల్లా ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించే భారీ సాంస్కృతిక ర్యాలీకి హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు తెల్లం రామారావు దొర, ఆదివాసి సంక్షేమ రాష్ట్ర నాయకుడు గడ్డం వెంకటేశ్వరరావు, ఆదివాసి యువ నాయకుడు కాకా రమేశ్ పాల్గొన్నారు.

# ఫ్యాబ్రిక్ డై, సింథటిక్ కలర్స్‌తో మసాలాల తయారీ



**హైదరాబాద్, ఆగస్టు 4 :** హైదరాబాద్‌లో కల్తీ మసాలాల తయారీ కేంద్రాలపై ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశామని భాగ్యనగర సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. 13 మసాలా వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రజల సమాచారం ఆధారంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పుకొచ్చారు. 25 టన్నులకుపైగా కల్తీ మసాలాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కల్తీ మసాలాల కేసుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశామని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి, బాలాపూర్ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. వాము, జీలకర్ర, లవంగం, షాజీరా, ఆవాలు సహా పలు మసాలాల్లో కల్తీ చేసినట్లు గుర్తించామని తెలిపారు. ఆ మసాలాల్లో హానికర రసాయనాలు..ఫ్యాబ్రిక్ డైలు, సింథటిక్ కలర్స్‌తో మసాలాల తయారీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ తెలిపారు. టాల్కమ్ పౌడర్, ఇండస్ట్రీయల్ డైలు, రైస్ బ్రాన్ ఆయిల్ వినియోగిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మసాలాలకు మెరుపు కోసం హానికర రసాయనాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రంగులు వేసి నాణ్యమైన మసాలాల మాదిరిగా విక్రయిస్తున్నారని చెప్పుకొచ్చారు. 89 టన్నులకుపైగా ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆహార భద్రత చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్తీ మసాలాల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపామని వెల్లడించారు. ఈ మసాలాలతో కేన్సర్..కల్తీ ఆహారం వల్ల కాలేయం, మూత్రపిండాలకు ముప్పు పొంచి ఉందని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మసాలాలతో కేన్సర్, అలర్జీలు, జీర్ణ సమస్యలు వచ్చే ప్రమాదమని తెలిపారు. ఎ- ఖీఉు ఏర్పడిన 140 రోజుల్లో 659 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామని అన్నారు. 202 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 246 టన్నుల కల్తీ ఆహారం స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ప్రజలు అనుమానాస్పద ఆహారంపై వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# ఇక హద్దులు పక్కాగా..గట్టు పంచాయతీలకు తెర




**జమ్మికుంట(కరీంనగర్):** నిజాం కాలంలో చేసిన సర్వేను ప్రమాణికంగా తీసు కుని ఇప్పటి వరకు భూముల సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. సాధారణంగా ప్రతి 30ఏళ్లకు ఒకసారి భూ సర్వే చేయాల్సి ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలు దానిని నిర్లక్ష్యం చేశాయి. దీంతో ప్రభుత్వ భూములు సైతం కబ్జా కావడంతోపాటు సరిహద్దు వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూభారతి రీసర్వే ప్రక్రియను అత్యాధునికమైన డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషన్ సిస్టమ్) విధానం ద్వారా నిర్వహిస్తోంది. ఈ సర్వేకు భూ భారతి పోర్టల్ ద్వారా జీపీఎస్ వెరిఫైడ్ ల్యాండ్ మ్యాపింగ్ సాంకే తికతను ఉపయోగిస్తున్నారు. ఉపగ్రహ ఆధారిత అక్షాంశాలు, రేఖాంశాలు ద్వారా భూమి సరిహద్దులను డిజిటల్‌గా లాక్ చేస్తారు. దీనివల్ల ఒకరి భూమిని మరొకరు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదు. గ్రామాల్లో ప్రధాన సమస్యలైన గెట్లు జరపడం, ఒకరి భూమిని మరొకరు ఆక్రమించుకోవడం, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, సంక్షేమ పథకాలను దొడ్డిదారిన పొందుతున్నటువంటి వారికి ఈ భూ భారతి చట్టం ద్వారా చెక్ పడనుంది. సాగు భూ ముల రిజిస్ట్రేషన్లలో సరిహద్దు మ్యాప్‌లను అను సంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త నిబంధన లను అమల్లోకి తెచ్చింది. ప్రతి పట్టా దారుకు భూధార్ అనే పేరుతో ఒక నంబర్‌ను కేటాయి ంచి, వారికి సంబంధించిన పూర్తి భూమి వివరాలు అందు లో పొందుప రుచుతారు. క్యూ ఆర్ కోడ్‌ను కేటాయించి, ఎల్‌పీఎమ్ విధానం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) ద్వారా రైతులకు సంబంధించిన పూర్తి వివరాలను క్రోడీకరించ నున్నారు. రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి సరిహ ద్దులు ఒకేలా ఉండేలా చూసి వివాద రహిత భూ మిగా గుర్తిసారు. రాష్ట్రవ్యాప్తంగా రీ-సర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూమికి ఒక ప్రత్యేక భూధార్ నంబర్‌ను కేటాయిస్తున్నారు. మనిషికి ఆధార్ కార్డు ఎలాగో, భూమికి ఈ భూధార్ కార్డు అలా పనిచేస్తుంది. ఇందులో భూమి విస్తీర్ణం, సరిహద్దుల మ్యాప్ డిజిటల్‌గా లింక్ అయి ఉంటాయి. ప్రతీ మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంచుకున్న ప్రభుత్వం.. ఆయా గ్రామాల్లో భూభారతి ద్వారా భూముల సర్వేను చేస్తోంది. జిల్లాలోని జమ్మికుంట మండలంలో విలాసాగర్ గ్రామం ప్రభుత్వం ఎంచుకున్న పైలట్ ప్రాజెక్ట్‌ల్లో ఒకటి. విలాసాగర్‌లో మొత్తం 386 సర్వే నెంబర్లు ఉండగా, అందులో 1,423 ఎకరాల 24 గుంటల భూమి ఉంది. 15 సర్వే నంబర్లలో 139 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 371 సర్వే నంబర్లలో 492 మంది రైతులకు సంబంధించిన 951 ఎకరాల భూమి ఉంది. మిగిలిన 333 ఎకరాల భూమి మానేరు వాగులో భాగంగా అధికారులు తేల్చారు.

# నీ సూసైడ్ నోట్ ఆధారంగానే కాంగ్రెస్ సర్కార్‌పై పోరాటం



**హైదరాబాద్ :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం లో ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన నిరుద్యోగి వేణు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిసి ందే. ఈ మేరకు వేణును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ ద్వారా పరా మర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆత్మహత్యాయత్నం చేసిన వేణుని ఆసుపత్రిలో పరామర్శించి కేటీఆర్ చేత ఫోన్ మాట్లాడించగా. వేణుకు ధైర్యం చెప్పిన కేటీఆ ర్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం లేదని, నోటిఫికేషన్ల కోసమే ఆత్మహత్యాయత్నం చేసుకుంటే.. తాను వ్యక్తిగత ప్రేమ వ్యవహారంతో ఆత్మహత్యాయత్నం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం తనపై దుష్ప్రచారం చేస్తోందని వేణు కేటీఆర్‌తో ఆవేదన పంచుకున్నాడు. మా అమ్మ మానసిక వికలాంగురాలు. తనకు సొంత ఇల్లు లేనప్పటికీ కక్ష పూరితంగానే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వ లేదన్నాడు. మా వేణు రాసింది సూసైడ్ నోట్ కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఛార్జ్ షీట్ అని ప్రెస్ మీట్ పెట్టి గట్టిగా మాట్లాడటం జరిగింది. దాని ఆధారంగానే కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తామని, రాగానే దాని ఆధారంగానే న్యాయం చేస్తామని కేటీఆర్ వేణుకు భరోసానిచ్చారు.

# 'ప్రభుత్వ నిర్లక్ష్యంతో సంక్షోభంలోకి వ్యవసాయ రంగం



**కోదాడ, ఆగస్టు 04 :** రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, ఎన్నికల్లో రైతులకు అండగా ఉంటామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారు స్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను దగా చేస్తుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలం టూ ముఖ్య నాయకులతో కలిసి ఆర్డీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన క్రాప్ లోన్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందన్నారు. గతంలో ప్రతి ఏడాది రైతులు పంట రుణాలను సులభంగా రెన్యువల్ చేసుకునేవారని ప్రస్తుతం బ్యాంకులో పాత రుణ మొత్తం అసలు, వడ్డీతో సహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని రైతులను తీవ్రంగా వేధిస్తున్నారన్నారు. బ్యాంకులపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడం వల్ల రైతులు మళ్లీ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ హామీని నిలబెట్టుకోలేదని, లో వోల్టేజీతో , ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, సకాలంలో నీరందకపోతే పంటలు ఎండిపోవడం ఖాయమని ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా ఎరువుల రవాణాకిచ్చే ఫ్రైవేట్ ఆన్ లారీ (ఎఫ్ ఓ ఎల్) రాయితీని ప్రభుత్వం రద్దు చేయడం దురదృష్టకరమన్నా రు. ఈ నిర్ణయంతో పీఏసీఎస్‌లు, డీలర్లు అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుందని ఈ భారం రైతుల పైనే పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎరువుల కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.

# చేనేత మగ్గంతో అద్భుతం - 170 నిమిషాల్లోనే అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర తయారీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా :** రంగురంగుల దారాలను మగ్గంపై పేర్చి, తమ ఊపిరిని నూలు పోగులుగా మలచి, అద్భుతమైన వస్త్రాలను సృష్టించే వారే చేనేత కార్మికులు. చేనేత అంటే కేవలం ఒక వృత్తి కాదు. తెలం గాణ సంస్కృతి, వారసత్వానికి, కళా వైభవానికి సజీవ రూపం. అలాంటి గొప్ప కళ గురించి ఇప్పుడు విస్తృతంగా మాట్లాడుకునే విధంగా చేశాడు ఈ నేతన్న. అంతే కాకుండా చేనేత వృత్తి గురించి నిరంతరం ప్రపంచానికి చాటి చేప్పే ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఎంత కళా నైపుణ్యమున్న చేనేత కార్మికుడైనా పట్టు చీరను నేయాలంటే కనీసంగా ఒక్కరోజు పడుతుంది. అలాంటిది కేవలం 170 నిమిషా ల్లో చీరను నేసి అగ్గిపెట్టెలో పట్టే విధంగా రికార్డు నెలకొల్పారు రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు వెల్ది హరిప్రసాద్. ఆగస్టు 7న అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల నేతన్నల కళా నైపుణ్యం, వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ సాహసం చేశారు. అను కున్న సమయం కన్నా ముందుగానే చీరను నేసి, అందరి నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు హరిప్రసాద్. చేనేత చరిత్రలో మైలురాయి : ఆగస్టు 3న ఉదయం 9:30 గంటలకు పట్టుచీర నేతను హరిప్రసాద్ తన యంత్రంలో పెట్టి ప్రారంభించాడు. 5.5 మీటర్ల పొడవు, 45 అంగుళాల వెడల్పు, 175 గ్రాముల బరువున్న చీరను 170 నిమిషాల్లో అంటే సరిగ్గా 12:20కి వేగంగా పూర్తి చేశాడు. ప్రత్యేక నైపుణ్యంతో ఆ చీరను మడిచి, ప్రముఖుల సమక్షంలో సాధారణ అగ్గిపెట్టెలో పెట్టి తన ప్రతిభను ప్రదర్శించారు. ఈ చీర తయారీలో సుమారు 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్పు పోగులు ఏమాత్రం తీసిపోకుండా సంప్రదాయ చేనేత మగ్గంపైనే ఈ అరుదైన ఘనత సాధించడం చేనేత చరిత్రలో చర్చనీయాంశంగా మారింది. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్?లో నమోదు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ రికార్డును సాధించడం కోసం హరిప్రసాద్ ఏడాది కాలంగా రోజుకు 3 నుంచి 4 గంటల పాటు సాధన చేసినట్లు తెలిపారు. "నేను ఒక సంవత్సర కాలంగా కష్టపడ్డాను. రోజుకు 3 గంటల చొప్పున నేసి చీరల తయారీ చేసేవాడిని. మరమగ్గంతో పోటీ పడాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేయడం సంతోషం గా ఉంది. ఈ చీర 10,500 వెఫ్ట్ పోగులు, 1,500 వార్పు పోగులతో 175 గ్రాముల బరువు ఉంటుంది. గతంలో +-20 లోగో నేసి ప్రధాని మోదీ గారికి పంపాం. 95వ మన్ కీ బాత్ కార్యక్రమంలో నా గురించి, మా సిరిసిల్ల పట్టణం గురించి మోదీ ప్రత్యేకంగా మాట్లాడా రు." - వెల్ది హరిప్రసాద్, చీరను నేసిన కార్మికు డుఒక చీరను ఎంత నైపుణ్యం ఉన్న నేత కార్మికుడు నేసినా కనీసం ఒక రోజు పడుతుంది. మర మగ్గం (ఆధునిక యంత్రం) మీద నేసినా అంతకన్నా ఎక్కువ సమయమే పడుతుంది. అలాంటిది మరమగ్గంతో పోటీ పడి, ఈ ఘనతను సాధించానని చెబుతున్నాడు హరి ప్రసాద్. శరీరంలోని అన్ని అవయవాలను ఏకీకృతం చేస్తే తప్ప ఇంత తక్కువ సమయంలో చీర నేయడం సాధ్యం కాదని చెబుతున్నాడు.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలి.. వైసీపీపై మంత్రి అనగాని ధ్వజం



**అమరావతి, ఆగస్టు 4 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటం ఆయనకు ఇష్టం లేదని ధ్వజమెత్తారు. (మంగళవారం) అమరావతి వేదికగా మంత్రి అనగాని మీడియాతో మాట్లాడారు. తాము ప్రతిపక్షంలో ఉండగా రైతులతో కలిసి పాదయాత్ర చేశామని ప్రస్తావించారు. చంద్రబాబుపై ఉన్న అక్కసుతో జగన్ అమరావతిపై నాడు విషం చిమ్మారని ఆగ్రహించారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చాక అమరావతిపై జగన్ బురద జల్లారని ఫైర్ అయ్యారు. ముందు రాజధాని అమరావతికి ఒకే అన్నారని.. ఆ తర్వాత మూడు రాజధానులు, మావిగాన్ అన్నారని ప్రస్తావించారు. వైసీపీ హయాంలో విధ్వంసం తర్వాత అమరావతిలో కట్టడాలు పటిష్ఠతపై తాము రిపోర్టు తీసుకొని రెండేళ్లలో పూర్తి చేశామని స్పష్టం చేశారు.భోగాపురంపై జగన్ అడ్డుపుల్ల వేశారు..అమరావతి నిర్మాణంలో ఉన్న భవనాలు అన్ని త్వరలోనే హ్యాండ్ ఓవర్ చేస్తామని మంత్రి అనగాని చెప్పుకొచ్చారు. డయాగ్రిడ్‌ను భారతదేశంలో తొలిసారిగా ఐకానిక్ బ్రిడ్జిలో వాడామని తెలిపారు. 2015లో భోగాపురం విమానాశ్రయం బేసిక్ డాక్యుమెంట్ తయారైందని అన్నారు. ఆ తర్వాత భోగాపురంపై జగన్ అడ్డుపుల్ల వేశారని దుయ్యబట్టారు. నాడు మహిళలు అని కూడా చూడకుండా అమరావతి రైతులను హింసించారని మండిపడ్డారు. మంత్రి నారా లోకేశ్ రిజైన్ చేయాలని వైసీపీ నేతలు అంటున్నారని.. ఆయన ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. తల్లికి వందనం, మెగా డీఎస్సీ, మెగా పీటీఎం పెట్టినందుకా లోకేశ్ రాజీనామా చేయాలని నిలదీశారు. ఆ పార్టీలో సైకిక్ ప్రాబ్లం ఉన్న నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. స్టాన్‌ఫర్డ్ పేరు పలికే అర్హత కూడా గొడ్డలి పార్టీ నేతలకు లేదని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు.

# "సర్"లో సవరణలకు మరో అవకాశం - ఆగస్ట్ 30 వరకు గడువు




**అమరావతి, ఆగస్టు 4 :** 30 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ భాగంగా జూన్ 15 నుంచి జులై 24 మధ్య మీ వివరాలు నింపిన ఎన్యూమరేషన్ ఫాంలను బూత్‌స్థాయి అధికారులకు ఇంకా సమర్పించ లేదా? తాజాగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో మీ పేరు లేదా? మీ పేరు జాబితాలో ఉన్నా పేరు, వివరాలు, చిరునామాల్లో ఏమైనా తప్పులు, సవరించాలా? లేకుంటే మార్పులు చేయాలా? జాబితాలోని అనర్హుల పేర్లపై అభ్యంతరం చెప్పాలా? వీటిపై దరఖాస్తు చేసుకునేందుకు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఓటర్లు, రాజకీయ పార్టీల బూత్‌స్థాయి ఏజెంట్లు–దీూా ఎవరైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఆగస్టు 30 వరకూ సమయం ఇచ్చింది."11 పత్రాల్లో ఏదో ఒకటి: నిర్దేశిత గడువులోగా బీఎల్‌వోలకు ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించిన వారిలో చాలా మంది 2002 నాటి ఓటర్ల జాబితాలోని మ్యాపింగ్ కోసం పేర్కొన్న వివరాల్లో లోపాలన్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. మరికొందరూ అయితే 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగే చేసుకోకుండా ఎన్యూమరేషన్ పత్రాలు ఇచ్చేశారు. ఇలాంటి వాటిని ఎన్నికల సంఘం క్షుణ్ణంగా పరిశీలించి వారికి నోటీసులు ఇస్తోంది. వీరంతా తమ అర్హత నిరూపించుకునేందుకు ఆధార్ కార్డు కాకుండా ఎన్నికల సంఘం సూచించిన 11 పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని పేర్కొంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లేదా పింఛనుదారుకు జారీ చేసిన ఐడెంటిటీ కార్డు లేదా పింఛను పేమెంట్ ఆర్డర్ గానీ సమర్పించాలి. 1987 జులైకి ముందు ప్రభుత్వ, స్థానిక సంస్థలు, బ్యాంకులు , పోస్టాఫీసు, ఎల్ఐసీ , పీఎస్‌యూలు జారీ చేసిన గుర్తింపు పత్రాలు సమర్పించవచ్చు. అధికారిక జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ , గుర్తింపు పొందిన బోర్డు, విశ్వవిద్యాలయం జారీచేసిన విద్యా సర్టిఫికెట్లు కూడా ఇవ్వొచ్చు.అర్హులని తేలితే తుది జాబితాలో పేరు: రాష్ట్ర అధికారులు జారీచేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ, అటవీ హక్కుల చట్టం సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ పత్రం, రాష్ట్ర, స్థానిక సంస్థలు తయారు చేసిన ఫ్యామిలీ రిజిస్టర్ పత్రం సమర్పించవచ్చు. ప్రభుత్వం జారీచేసిన భూమి ,ఇంటి కేటాయింపు పత్రం కూడా ఇవ్వొచ్చు. వీటిలో ఏదో ఒకటి సంబంధిత అధికారులకు సమర్పించాలి. వెబ్‌సైట్‌లో లేదా జుజ×చీజు మొబైల్ యాప్‌లోకి వెళ్లి లేదా నేరుగా బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలకు ఇవి సమర్పించవచ్చు. వాటిని పరిశీలించి అర్హులని తేలితే అక్టోబరు 3న విడుదల చేసే తుది జాబితాలో పేరు చేరుస్తారు.ఫాం–6ను కొత్తగా ఓటరుగా నమోదయ్యేందుకు ఈ దరఖాస్తు, దాంతో పాటు డిక్లరేషన్ ఫాం సమర్పించాలి. ఫాం–7ను ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లు గమనిస్తే వాటి తొలగింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఫాం–8ను నియోజకవర్గం పరిధిలో ఒకచోట నుంచి మరో చోటకు లేదా ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజ కవర్గంలోకి మారితే ఓటును ప్రస్తుతం ఉన్న చిరునామాకు మార్చుకునేందుకు, ఓటర్ల జాబితాలోని మీ పేరు, వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిదిద్దేందుకు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డులో తప్పొప్పులు ఉంటే వాటిని సరిచేసు కోవటానికి ఈ ఫాంలో దరఖాస్తు చేయాలి.

# వైఎస్ జగన్ హయాంలో డెయిరీ రంగం కుదేలు.



**న్యూఢిల్లీ:** వైస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమ రంగం కుదేలైనట్లు పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సందర్భంగా కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఏపీలో డెయిరీ రంగం పడిపోయిన తీరును స్పష్టం చేశాయి. వైసీపీ హయాంలో పాల ఉత్పత్తి తగ్గడం, తలసరి పాల లభ్యత క్షీణించడం వంటి అంశాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని వివరించింది.ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి 15.45 మిలియన్ టన్నుల నుంచి 13.95 మిలియన్ టన్నులకు పడిపోయిందని కేంద్రం తెలిపింది. ఒకే సంవత్సరంలో దాదాపు 10 శాతం మేర పాల ఉత్పత్తి తగ్గినట్లు వెల్లడించింది. అదే సమయంలో రోజువారీ తలసరి పాల లభ్యతా 799 గ్రాముల నుంచి 716 గ్రాములకు తగ్గిపోయినట్లు పేర్కొంది. ఈ గణాంకాలు జగన్ హయాంలో పాడిపరిశ్రమ ఎదుర్కొన్న సంక్షోభానికి అద్దంపడుతున్నాయి. ఇదే సమయంలో ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత డెయిరీ రంగానికి కేంద్రం భారీ స్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నట్లు లోక్‌సభలో వెల్లడైంది. ముఖ్యంగా నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (చీూణణ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.115.65 కోట్లను మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. గతంలో ఇదే పథకం కింద కేవలం రూ.6 కోట్లే కేటాయించగా.. ప్రస్తుతం ఆ మొత్తాన్ని దాదాపు 19 రెట్లు పెంచడం గమనార్హం. అంతేకాకుండా పశుసంవర్ధక మౌలిక వసతుల అభివృద్ధి నిధి కింద కూడా ఏపీకి కేటాయింపులు పెరిగాయి. ఈ పథకం ద్వారా రూ.6.57 కోట్ల నిధులను అందించినట్లు కేంద్రం వెల్లడించింది. మరోవైపు పశువుల్లో వ్యాధుల నివారణ, ఉచిత టీకాల కార్యక్రమాల అమలు కోసం రూ.75.96 కోట్లను విడుదల చేసినట్లు తెలిపింది. రాష్ట్రంలో డెయిరీ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. రైతుల ఆదాయం పెంచడంతో పాటు పాల ఉత్పత్తినీ గణనీయంగా పెంచే లక్ష్యంతో పలు కార్యక్రమాలు అమలులో ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది.

# మెగా డీఎస్సీ పిల్‌లో జోక్యానికి ఏపీ హైకోర్టు నిరాకరణ



**అమరావతి, ఆగస్టు 4 ):** మెగా డీఎస్సీ 2025పై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వేసిన పిల్‌లో జోక్యానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టునిరాకరించింది. స్పోర్ట్స్ కోటా వల్ల నష్టపోయిన అభ్యర్థులు నేరుగా కోర్టుకు ఎందుకు హాజరుకావడం లేదని ప్రశ్నించింది. బాధిత అభ్యర్థులు నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు భయపడుతున్నారనే వాదనతో ఏకీభవించలేమని తెలిపింది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్, నియామకాలను సవాల్ చేస్తూ ఇప్పటివరకు 335 పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు పేర్కొంది.ప్రజా ప్రయోజన వ్యాజ్యమనేది చాలా విలువైన సాధనమని ఏపీ హైకోర్టు వెల్లడించింది. రాజకీయ ప్రయోజనాల కోసం దానిని వినియోగించడానికి అనుమతిస్తే పిల్ ఉద్దేశం దెబ్బతింటుందని హెచ్చరించింది. ఈ పిల్‌పై వాదనలు కొనసాగిస్తారా?, ఉపసంహరించుకుంటారా? పిటిషనర్ నుంచి ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకొని తమ ముందుకు రావాలని న్యాయస్థానం సూచించింది. ఈ మేరకు వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి న్యాయవాదికి న్యాయస్థానం సూచించింది. మెగా డీఎస్సీ 2025పై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ హైకోర్టులో హైకోర్టులో పిల్ వేసిన విషయం తెలిసిందే.

# మంత్రి నారాయణను సన్మానించిన క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు



**అమరావతి, ఆగస్టు 4 :**

మంత్రి నారాయణను క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు (మంగళవారం) కలి శారు. మంత్రికి అభినందనలు తెలిపి సన్మా నించారు. భవన నిర్మాణ అనుమతుల్లో నిబం ధనలు సులభతరం చేస్తూ ఇటీవల జీవో నంబ ర్161 జారీ చేసిన విషయం తెలిసిందే. ముని సిపల్ శాఖ నిబంధనలు సరళతరం చేయ డంలో కీలకంగా వ్యవహరించినం దుకు మంత్రి నారాయణను అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగానికి ఎంతో ఊపు వచ్చిందని తెలిపారు. డిక్లరేషన్ విధానం నుంచి సెట్ బ్యాక్‌ల తగ్గింపు వరకూ ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు వెల్లడించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ వల్లే రియల్ ఎస్టేట్ పరిశ్రమ వృద్ధి చెందిందని కొనియాడారు. తిరుపతి, రాజమండ్రిలో త్వరలో నిర్వహించే క్రెడాయ్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంత్రికి ఆహ్వానం పలికారు. శ్రీనివాసు, జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబు, ఇతర ప్రతినిధులు ఉన్నారు.

# జలధార పనుల పురోగతిపై పవన్ సమీక్ష



**అమరావతి, ఆగస్టు 4 :**జల్‌జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా గోదావరి జిల్లాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పనుల పురోగతిపై మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చేలా ఈ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు.నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్‌జీవన్ పనుల వేగం పెంచాలని పవన్ సూచించారు. ఇన్‌టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయ ర్లతోపాటు పైప్‌లైన్ల నిర్మాణం వంటి కీలక పనుల పురోగతికి సంబంధించిన వివరాలు ఆర్‌బ్ల్యూఎస్ అధికారులు వివరించారు.తాగునీటి కష్టాలకు చెక్: రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడం పట్ల పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని 10 నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు.పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో అమరజీవి జలధారకు శ్రీకారం చుట్టామన్నారు. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్ల నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్?లో ఉంటే ఆ ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారి అథారిటీ, పంచాయతీరాజ్ శాఖలు, అవసరం ఉన్న చోట అటవీశాఖలతో సమన్వయం చేసపనుల వేగం పెంచాలని, అదే సమయంలో నిర్మాణ పనుల ఎకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలని, అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని పవన్ వెల్లడించారు. నాణ్యతాపరమైన తనిఖీలు స్వయంగా నిర్వహిస్తామని తెలిపారు.

# జలాశయాల్లోకి క్రమంగా పెరుగుతున్న వరద నీరు



**శ్రీశైలం:** ఇన్నాళ్లూ వెలవెల బోయిన జలాశయాల్లోకి క్రమంగా వరద ప్రవాహాలు చేరుతున్న వేళ రైతుల్లో ఆశలు చిగురుస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. 100 టీఎంసీల చేరువలో ఉంది. తుంగభద్ర జలాశయానికీ భారీ వరద ప్రవాహం వస్తోంది. గోదావరి నుంచి ఇప్పటికే 306 టీఎంసీల నీరు సముద్రంలోకి కలిసిపోయింది.తీవ్ర ఎల్‌నినో పరిస్థితులతో ఆందోళన చెందుతున్న రైతులకు కృష్ణా ఎగువ జలాశయాలు కాస్త ఆశలు కలిగిస న్నాయి. ఆలమట్టి జలాశయంలోకి ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 178.87 టీఎంసీల నీరు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 123.081 టీఎంసీలు, ప్రస్తుతం 119.9 టీఎంసీల మేర నిల్వ చేస్తూ మిగిలిన నీటిని దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ లోకి 92.22 టీఎంసీలు వచ్చాయి. పూర్తి నీటి నిల్వ 33.313 టీఎంసీలే. ఈ జలాశయంలోనూ 29.49 టీఎంసీలు నిల్వ చేసి మిగిలిన నీటిని దిగువకు వదులుతున్నారు.వంద టీఎంసీల చేరువలో శ్రీశైలం జలాశయం: తెలంగాణలోని జూరాల జలాశయం పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు. 7.44 టీఎంసీల మేర నిల్వ చేస్తూ, ఆపై ప్రవాహాన్ని శ్రీశైలానికి వదిలిపెడుతున్నారు. తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 93.58 టీఎంసీల నీరు ఉంది. మంగళవారం 100 టీఎంసీలకు చేరుకోనుంది. పూర్తి స్థాయిలో నిండాలంటే 215.807 టీసీఎంసీలకు చేరుకోవాలి. ఎగువ నుంచి లక్షా 60 వేల 537 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. అలమట్టి, నారాయణపూర్, జూరాల జలాశయాలు నిండిపోయి నీరు దిగువకు వదులుతున్నారు.సగం నిల్వలకు దగ్గరగా తుంగభద్ర: తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 105.788 టీఎసీలు. ప్రస్తుతం 44.19 టీఎంసీలకు చేరింది. నదీ పరివాహక ప్రాంతాల్లో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శివమొగ్గ జిల్లా శృంగేరి వద్ద తుంగా నది గేట్లన్నీ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆ జలాలు నేరుగా తుంగభద్ర నదిని చేరుకోవడంతో జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది.దిగువకు వదులుతు న్నారు.సగం నిల్వలకు రోజూ కనీసం 6 టీఎంసీల వరకు నీటి నిల్వలు పెరుగుతున్నాయి.గోదావరికి భారీగా వచ్చిన వరద: సాధారణంగా ఖరీఫ్ లో గోదావరి డెల్టా వ్యవస్థకు నీటి సమస్యలు ఎదురైన సందర్భాలు అరుదు. ఈ ఏడాది సీలేరు నుంచి బైపాస్ చేసి నీళ్లు మళ్లించాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. జులై తొలి రోజుల్లో గోదావరిలో ప్రవాహం కరవైంది. అయితే జులై చివరిలో గోదావరికి ఎగువ నుంచి వరద ప్రవాహం మొదలైంది.ఈ సీజన్?లో ఇప్పటి వరకు అత్యధికంగా 14 లక్షల 61 వేల క్యూసెక్కుల వరద నీరు ధవళేశ్వరం కాటన్ బ్యారేజిని తాకింది. గోదావరిపై నీరు నిల్వ చేసే అవకాశం దిగువకు వదులుతున్నారు.సగం నిల్వలకు లేకపోవడంతో వచ్చిన నీరు వచ్చినట్టు సముద్రంలోకి వదిలేస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటి వరకు 14.46 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకుకు తరలించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 306 టీఎంసీల నీరు సముద్రంపాలయ్యింది.

# పెద్దపులి మృతి కేసులో ఇద్దరు అనుమానితుల అరెస్ట్



**గుంటూరు, ఆగస్టు 4:** మార్కాపురం జిల్లా గిద్దలూరు అటవీ డివిజన్, రాచర్ల బీట్‌లో ఉన్న గుండ్లకమ్మ అటవీ ప్రాంతంలో పెద్దపులి మృతి కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇద్దరు అనుమానితులను అదుపు లోకి తీసుకున్నారు. గిద్దలూ రుకు చెందిన అంజి, నంద్యా ల జిల్లాకు చెందిన వీరాంజ నేయులును గుంటూ రు జిల్లా మేడికొండూరులో అరెస్ట్ చేశారు. ఆపై వారిద్దరినీ గిద్దలూరుకు తరలించారు. పెద్దపులి మృతిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయిన విషయం తెలిసిందే. పారదర్శక విచారణ చేపట్టాలని అటవీ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 20 రోజుల క్రితం మార్కాపురం జిల్లా గిద్దలూరు అటవీ ప్రాంతంలో ఉచ్చులో పడి పెద్దపులి మృతి చెందింది. కొందరు వ్యక్తులు పులి కాళ్లను నరికి గోళ్లను ఎత్తుకుపోవడం కలకలం రేపింది. పులి మరణంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. పెద్దపులి మృతి ఆదోళన కలిగించిందన్నారు. పులి మరణం వెనుక ఉన్న కారణాలను వెలికి తీయాలని, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. పులిది సహజ మరణమా, వేటగాళ్ల దుశ్చర్య, విషప్రయోగం జరిగిందా అనే కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలన్నారు. డిప్యూటీ సీఎం విస్తృతంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.




# శంకర్ కుమార్తె అదితి కొత్త చిత్రం 'వన్స్ మోర్'...

ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న అదితి శంకర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'వన్స్ మోర్'. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది.విఘ్నేశ్ శ్రీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మిలియన్ డాలర్ స్టూడియోస్ తమ సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని పంచుకుంది. "పండగ రోజు ఇదే. నిరీక్షణకు తెరపడి ప్రేమ మొదలయ్యే చోటు. మా ప్రేమ క్యాలెండర్‌లో ఇష్టమైన తేదీ దొరికింది. 'వన్స్ మోర్' ఆగస్టు 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది" అని పోస్ట్ చేసింది.ఈ సినిమాకు పలు ఆకర్షణలు ఉన్నాయి. ముఖ్యంగా, మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించి సంచలనం సృష్టించిన ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్, ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన కొన్ని పాటలు సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో మోడల్, నటి సోనా ఒలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు అరవింద్ విశ్వనాథన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, నాష్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. రాజ్ కమల్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. మిలియన్ డాలర్ స్టూడియోస్ పతాకంపై యువరాజ్ గణేశన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హరీశ్ దురైరాజ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, విజయ్ ఎంపీ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

## అప్పుడు క్లాప్ అసిస్టెంట్.. ఇప్పుడు అదే హీరోకి ప్రొడ్యూసర్..

# నానిది అసలైన విజయం!




సినీ పరిశ్రమలో ఎవరి జాతకం ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేసిన వ్యక్తి, రెండు దశాబ్దాల తర్వాత అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం నిజంగా ఓ అద్భుతం. అలాంటి స్ఫూర్తిదాయక ప్రయాణమే నేచురల్ స్టార్ నానిది. హీరో నితిన్ కథానాయకుడిగా, నాని సమర్పణలో 'అలియాస్ రుక్మిణీ' అనే కొత్త చిత్రం నిన్న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.ఈ సందర్భంగా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 21 ఏళ్ల క్రితం, 2005లో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో నితిన్ హీరోగా నటించిన 'అల్లరి బుల్లోడు' సినిమాకు నాని క్లాప్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అప్పట్లో నితిన్‌పై చిత్రీకరించిన సన్నివేశాలకు క్లాప్ కొట్టిన నాని, ఇప్పుడు అదే నితిన్ సినిమాకు నిర్మాతగా మారి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టడం విశేషం. ఈ రెండు సందర్భాలకు సంబంధించిన ఫొటోలను పోలుస్తూ.. 'ఇదే కదా అసలైన సక్సెస్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు.దర్శకుడు కావాలనే లక్ష్యంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాని, లెజెండరీ డైరెక్టర్ బాపు వద్ద 'రాధా గోపాళం' సినిమాకు, ఆ తర్వాత రాఘవేంద్రరావు వద్ద డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో పైకొచ్చారు. అనుకోకుండా 'అష్టా చమ్మా' చిత్రంతో హీరోగా మారి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ, సినిమా సినిమాకు తన నటనను మెరుగుపరుచుకుంటూ ప్రేక్షకుల హృదయాల్లో పక్కింటి కుర్రాడిగా స్థానం సంపాదించారు.ఒకప్పుడు మినిమమ్ గ్యారెంటీ హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఇప్పుడు రూ.100 కోట్ల మార్కెట్ ఉన్న స్టార్‌గా ఎదిగారు. హీరోగానే కాకుండా నిర్మాతగానూ అభిరుచి గల చిత్రాలను నిర్మిస్తున్నారు. ఒకప్పుడు క్లాప్ అసిస్టెంట్‌గా ఉన్న స్థాయి నుంచి, అదే హీరోతో సినిమా నిర్మించే స్థాయికి ఎదగడం ఆయన పట్టుదలకు, కష్టానికి నిదర్శనం. త్వరలో ఆయన మెగాస్టార్ చిరంజీవితోనూ ఓ సినిమా చేయనుండటం ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుంది.

# విశ్రాంతి తీసుకుంటున్న తారక్..

## నాన్ స్టాప్ గా జరుగుతున్న 'డ్రాగన్' షూటింగ్



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైన సంగతి తెలిసిందే. వైద్యుల సలహా మేరకు ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. డాక్టర్ల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందుతుండగా, మరో రెండు వారాల పాటు ఆయన షూటింగ్‌కు దూరంగానే ఉండే అవకాశం ఉందని సినీ వర్గాలు వెల్లడించాయి.హీరో అందుబాటులో లేనప్పటికీ ఆయన నటిస్తున్న 'డ్రాగన్' చిత్ర బృందం పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందడుగు వేస్తోంది. సమయం వృథా కాకుండా నాన్-స్టాప్ షూటింగ్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం ఎన్టీఆర్ లేని సన్నివేశాలను దర్శకుడు ప్రశాంత్ నీల్ చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఆయన పూర్తి కోలుకుని సెట్స్‌లో అడుగుపెట్టిన వెంటనే ఆయనకు సంబంధించిన కీలక ఘట్టాలను చిత్రీకరించేలా ప్లాన్ చేస్తున్నారు.కాగా, ఈమధ్య కాలంలో టాలీవుడ్‌లో వరుసగా నటీనటులు గాయపడటం అభిమానులను కలవరపెడుతోంది. ఇటీవల సీనియర్ బాలకృష్ణ, రష్మిక మందన్న, రామ్ చరణ్ కూడా గాయపడిన సంగతి తెలిసిందే.



# నా పర్సనల్ లైఫ్ గురించి మీకేం తెలుసు?

## : పుకార్లపై అనుపమ పరమేశ్వరన్ ఘాటు స్పందన

యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న సందేశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తమిళ నటుడు ధృవ్ విక్రమ్‌తో ప్రేమాయణం ముగిసిందని, ఆ బ్రేకప్ బాధలోనే ఆవేదనతో కూడిన పోస్టులు పెడుతోందంటూ నెట్టింట పుకార్లు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన అనుపమ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. "నా అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఏం పోస్ట్ చేయాలనేది పూర్తిగా నా వ్యక్తిగత హక్కు, నా సొంత నిర్ణయం. నా బాధను ఇతరుల ముందు ప్రదర్శించి సానుభూతి పొందాల్సిన అవసరం నాకు లేదు. ఒక సాధారణ మహిళగా జీవితంలో ఎదుర్కొనే మార్పుల గురించే నేను మాట్లాడాను. ఆ మార్పులను సమాజంతో ధైర్యంగా పంచుకోవడం నాకు గర్వంగా అనిపిస్తోంది. నా జీవితం, నా పర్సనల్ లైఫ్ గురించి బయట ఉన్న మీకేం తెలుసు? ఇది నా ఇన్‌స్టాగ్రామ్, నాకు నచ్చినవి నేను పోస్ట్ చేసుకుంటాను. నన్ను ప్రశ్నించడానికి మీరెవరు?" అంటూ ఆమె ఘాటుగా సమాధానమిచ్చింది.మరోవైపు రొటీన్ కథలకు భిన్నమైన ప్రాజెక్టులను ఎంచుకుంటున్న అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కల్యాణం' అనే చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు బద్రప్ప సారథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, నరేశ్, అఖిల్ ఉడ్డెమారి కీలక పాత్రలు పోషిస్తున్నారు. పర్సనల్ లైఫ్‌పై వచ్చిన వదంతులకు సూటిగా చెక్ పెట్టిన అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.

# జ్యోతిక నాపై నమ్మకం ఉంచింది..

## అందుకే ఆ సాహసం చేశా: సూర్య



స్టార్ హీరో సూర్య తన 'కరుప్పు' సినిమా విడుదల సమయంలో ఎదుర్కొన్న తీవ్ర ఆర్థిక కష్టాల గురించి తాజాగా వెల్లడించారు. సినిమా విడుదలకు చివరి నిమిషంలో అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అండగా నిలబడిందని ఆయన తెలిపారు.

ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో త్రిషతో కలిసి సూర్య నటించిన 'కరుప్పు' చిత్రం 2026 మే 14న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని ఆర్థిక సమస్యల కారణంగా ఒకరోజు ఆలస్యమైంది. తమిళనాడులో పంపిణీకి సంబంధించిన లావాదేవీలు కొలిక్కి రాకపోవడంతో ఆ రోజు ఉదయం షోలు రద్దయ్యాయి. దీంతో సూర్య స్వయంగా రంగంలోకి దిగి, వ్యక్తిగతంగా భారీ మొత్తం చెల్లించడంతో పాటు అదనపు నిధులు సమకూర్చి మే 15న సినిమాను విడుదల చేశారు. అనేక అడ్డంకులను దాటుకుని విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలన విజయం నమోదు చేసింది.

ఈ నేపథ్యంలో 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఆనాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. "ఈ విషయంలో జ్యోతికకు థ్యాంక్స్ చెప్పాలి. అది చాలా పెద్ద ఆర్థిక భారం. చివరి నిమిషంలో నా మీద పడింది. నేను అదనపు రుణాలు తీసుకుంటున్నప్పుడు ఆమె నాపై నమ్మకం ఉంచింది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే, కుటుంబంగా మేమంతా కష్టాలు పడాల్సి వచ్చేది. అయినా ఆమె నా నిర్ణయాన్ని నమ్మింది" అని సూర్య వివరించారు.అయితే, జ్యోతిక మాత్రం ఈ ప్రశంసను స్వీకరించలేదు. "ఈ క్రెడిట్ నేను తీసుకోను. ఇదంతా పూర్తిగా ఆయన కృషే. సినిమాను విజయవంతం చేయాలనే ఆయన ఔదార్యం వల్లే ఇది సాధ్యమైంది" అని ఆమె బదులిచ్చారు. ఈ విజయం వెనుక దర్శకుడు ఆర్‌జే బాలాజీ, ఇతర ఫైనాన్షియర్ల కృషి కూడా ఉందని సూర్య పేర్కొన్నారు.

# ఫ్యామిలీ మెలోడీతో వచ్చిన రవితేజ..

## 'ఇరుముడి' నుంచి కొత్త పాట

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి' నుంచి మేకర్స్ రెండో పాటను విడుదల చేశారు. 'యాలాలలో యాలాలలో' అంటూ సాగే ఈ మెలోడీ సింగిల్‌ను తాజాగా విడుదల చేశారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది.

ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం సమకూర్చారు. ప్రముఖ గాయకులు హేశం అబ్దుల్ వహాబ్, సాధిక కలిసి ఆలపించారు. తెలుగుతో పాటు తమిళంలో కూడా 'మనసు తన్నాలా' పేరుతో ఈ పాటను ఏకకాలంలో విడుదల చేశారు.

'ఇరుముడి' చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసిన చిత్రబృందం, ఆగస్ట్ 21న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

